
సివిల్స్ ర్యాంకర్లను అభినందిస్తున్న జస్టిస్ వేణుగోపాల్

సివిల్స్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకోవాలి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 21 : యువత సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకొని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సూచించారు. సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకొని కరీంనగర్ మంకమ్మతోటలోని తన నివాసంలో ఆదివారం సివిల్ ర్యాంకర్లకు ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన నందాల సాయికిరణ్(యూపీఎస్సీ 27వ ర్యాంకు), కొలనుపాక సహన (739వ ర్యాంక్) ను ఆయన అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ర్యాంకులు సాధించేందుకు దోహదపడ్డ అంశాలపై ఇష్టాగోష్ఠిగా వారితో చర్చించారు. రాజ్యాంగానికి లోబడి ఉద్యోగ వృత్తిని కొనసాగిస్తూనే సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నేటి యువత సన్మార్గంలో పయనిస్తూ తమ జీవిత లక్ష్యాలను చేరుకొని కీర్తి, ప్రతిష్టలను పొందాలన్నారు. పుట్టిన గడ్డ గర్వపడేలా మరో పది మందికి ఆదర్శంగా నిలుస్తూ పేరు, ప్రతిష్టలు సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి కే వెంకటేశ్, 14వ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేశ్, న్యాయవాదులు ఉప్పల అంజనీప్రసాద్, ఏవీ రమణ, ఏ కిరణ్ కుమార్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వడకాపురం జగదీశ్వరాచారి, ర్యాంకర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాయికిరణ్‌కు సన్మానం

విద్యానగర్/ కొత్తపల్లి, ఏప్రిల్ 21: ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో 27వ ర్యాంక్ సాధించిన వెలిచాలకు చెందిన సాయికిరణ్‌ను ఆదివారం లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ సెక్రటరీ మానవాడ శంకర్, ట్రెజరర్ నన్నువాళ్ల గిరిధర్ రావు, థర్డ్ ప్రెసిడెంట్ చిలుకూరి రాములు, కోఆర్డినేటర్ కుంభోజు రమేశ్, లయన్ సభ్యులు మమత, వేణు, కోమటిరెడ్డి తిరుపతిరెడ్డి, రామేశ్వరరావు, అనంత రెడ్డి శ్రీనివాస్, హరిప్రియ, శరత్ పాల్గొన్నారు. అలాగే టీఎన్జీవో సంఘ భవనంలో స్టేట్ ఆడిట్ రాష్ట్ర సంచాలకుడు మార్తినేని వెంకటేశ్వర్‌రావు, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను ఘనంగా సత్కరించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, భువనగిరి డిప్యూటీ డైరెక్టర్లు రాజ్ కుమార్, శరత్ చంద్ర, వెంకన్న, కృపాకర్‌రావు, టీఎన్జీవోల నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, సర్దార్ హర్మీందర్‌సింగ్, ఏవీ రాజేశ్వరరావు, సీహెచ్ జోయల్, అల్లె శ్రీనివాస్, లక్ష్మీకాంతయ్య, పవన్ కుమార్, రవి బాబు, వంశీ, శంకర్, మునిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓ గుడి తెచ్చిండా.. బడి తెచ్చిండా?

మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

- ఐదేళ్లలో బండి సంజయ్ ఏంచేసిండు?
- ఎన్నికలు వస్తేనే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తరు
- అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- గ్యారెంటీల పేరుతో ఆగం చేసింది
- నన్ను ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- నా చివరి శ్వాస ప్రజా సేవకే అంకితం
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్

కొత్తపల్లి, ఏప్రిల్ 21 : ''కేంద్రంలో అధికారంలో ఉన్నా ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లు ఐదు రూపాయల పని కూడా చేయలేదు. ఓ గుడి తెచ్చిండా.. ఓ బడి తెచ్చిండా?'' అని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. ఎన్నికలు వస్తేనే ఆయనకు ప్రజలు గుర్తుకు వస్తారని మండిపడ్డారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకున్నది ఉన్నది ఊడగొట్టడానికి కాదని, కాంగ్రెస్ వస్తే ఇంకేదో మేలు చేస్తారని ఆశపడి ఓట్లు వేస్తే ప్రజల నడ్డి విరిచేలా సర్కారు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాల్సిందిపోయి గతంలో ఉన్న పథకాలకు మంగళం పాడుతున్నదన్నారు. డిసెంబర్ 9వ తేదీనే రైతు రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేటికీ నెరవేర్చలేకపోయిందన్నారు. యాసంగి పంటకు రూ.500 బోనస్, రైతుభరోసా, మహిళలకు రూ.2500 ఆరిథక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు కూలీలకు రూ.12 వేల హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మిన ప్రజలు నట్టేట మునిగారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ఈడీ, సీబీఐతో కేసులు పెడుతూ భయపెడుతున్నదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.

వినోద్‌కుమార్‌తోనే అభివృద్ధి

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న వినోద్‌కుమార్ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, ఈ విషయం గతంలోనే నిరూపితమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఉండదని, ఆపార్టీలోని నాయకులే సీఎం రేవంత్‌రెడ్డిని గద్దెదించుతారన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో కేవలం పార్టీకోసమే పనిచేశాడే తప్ప ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. ప్రజల మనోభావాలతో బండి సంజయ్ రాజకీయం చేస్తున్నారని, ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన పప్పులు ఉడకవన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యులు జమీలొద్దీన్, కౌన్సిలర్లు మొండయ్య, వేణుగోపాల్, రాంబాబు, సత్యనారాయణ రెడ్డి, విజయ రమేశ్, కో ఆప్షన్ సభ్యులు ఫక్రొద్దీన్, ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ఎస్కే బాబా, సుధాకర్, వెంకట్‌రెడ్డి, కొమురయ్య, రుద్ర రాధ, మహేశ్వరి, కోటేశ్వర్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 21 : జిల్లాలో ఓటరు నమోదు జాబితాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పూర్తి చేసి, నివేదికలు పంపాలని సంబంధితాధికారులను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరాయంగా విధులు నిర్వహించాలన్నారు. ఎనిమిది గంటలకో టీమ్ చొప్పున 24 గంటల పాటు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని చెక్‌పోస్టులు పూర్తి స్థాయిలో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది ఉండాలన్నారు. జిల్లాలోని పరిస్థితులపై ఏఆర్‌వోలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన చర్యలకు నివేదికలందించాలన్నారు. సమావేశంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఆర్‌వోలు కే మహేశ్వర్, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు


మధురానగర్‌లో పోచమ్మ బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, ఏప్రిల్ 21: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్‌లో ఆదివారం నిర్వహించిన పోచమ్మ బోనాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాడి పంటలతో చొప్పదండి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని పోచమ్మ తల్లిని ప్రార్థించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జాతర కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సత్తు కనకయ్య, నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పెంచాల చందు, రోహిత్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులకు ఓటు అడిగే నైతికత లేదు'

శంకరపట్నం, ఏప్రిల్ 21: ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ నాయకులు ఏ ముఖం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడుగుతారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఓటు అడిగే నైతికత కోల్పోయారన్నారు. తెలంగాణ, కర్ణాటక పేరు చెప్పి పాంచ్ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను మోసం చేయ చూస్తున్నదన్నారు. వారి ఆటలు సాగవన్నారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడవద్దని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీటీసీ ఏనుగుల అనిల్, నాయకులు సమ్మిరెడ్డి, కొమురయ్య, నరేందర్, రాజిరెడ్డి, అశోక్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణ కేసులో ఇద్దరు రిమాండ్

రాంనగర్, ఏప్రిల్ 21: విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించిన కేసులో నలుగురిపై కేసు నమోదు కాగా, ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. జిల్లాలోని గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య 2003లో మూల గౌరారెడ్డి అనే వ్యక్తి వద్ద కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని సర్వేనెంబర్ 233/ఈ లోని 293.33 చదరపు గజాల ప్లాట్‌ను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడు. మూల గౌరా రెడ్డి మరణానంతరం అతడి కొడుకు మూల తిరుమలరెడ్డి సదరు ప్లాట్‌కు గల 50 ఫీట్ల రోడ్డు తనదేనని, దానిని ఆక్రమించి రెండు ప్లాట్లుగా విభజించి డాక్యుమెంట్లు సృష్టించాడు. తిరిగి దానిని తన తల్లి అయిన మూల వీరమ్మ (మూల గౌరారెడ్డి భార్య) పేరిట తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, దానిని మూల సూర్యప్రకాశ్ రెడ్డి, లంక శేఖర్‌కు విక్రయించినట్లుగా తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించాడు. వాటి ఆధారంగా గోడను సైతం నిర్మించారని తెల్ల రాజయ్య కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు, నలుగురిపై కేసు నమోదు చేశారు. మూల తిరుమలరెడ్డి (53), లంక శేఖర్(52)ని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరపరచగా, నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా గుర్రాల మల్లేశం

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ముదిరాజ్ సంఘ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాల మల్లేశం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ముక్క కృష్ణమూర్తి కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 21: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ముక్క కృష్ణమూర్తి మనుమడు, వైద్యులు ముక్క నవీన్, స్వాతి దంపతుల కుమారుడు నివేష్ మృతి చెందగా, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, వరంగల్ జడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధి కాశ్రీనివాస్ దంపతులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తదితరులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫోన్ ద్వారా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మృతదేహం త్వరగా వచ్చేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

భాషా పండితుల ఉద్యోగోన్నతులకు కృషి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 21 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ అబ్దుల్లా పేర్కొన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ కార్యవర్గ సమావేశం ఆదివారం సుభాష్‌నగర్‌లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలంగా భాషా పండితుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన కేసు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో తీర్పు భాష పండితులకు అనుకూలంగా రావడంపై హర్షం వ్యక్తంచేశారు. పండిత పరిషత్ పోరాటానికి ఈ తీర్పు నిదర్శమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ చైతన్య, ఎండీ ఉమర్ అలీ, గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టెకోల స్వామి, ప్రధాన కార్యదర్శి ఎం కరుణాకర్, జిల్లా బాధ్యుడు శ్రీనివాస్, దీపక్ మిరాని, శ్యామ్, జహంగీర్, సునీత, రేణుక, శారద తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధర, ఏప్రిల్ 21 : మండలంలోని బూరుగుపల్లి వివేకవర్ధిని పాఠశాల పూర్వ విద్యార్థుల (2009-10 పదో తరగతి బ్యాచ్) ఆత్మీయ సమ్మేళాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులకు తమకు చదువు చెప్పిన మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దీవెన దంపతులను శాలువాతో సన్మానించారు.

సైదాపూర్, ఏప్రిల్ 21: సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1992-93 బ్యాచ్ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తలంబ్రాల బుకింగ్ గడువు పొడిగింపు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ గడువును ఈ నెల 25వరకు పొడిగించారని కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్ ఏటీఎం సదాశివ్ శనివారం తెలిపారు. భక్తులు తలంబ్రాల కోసం లాజిస్టిక్ కౌంటర్లు, ఆన్‌లైన్, ఏజెంట్ల వద్ద రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. బుకింగ్ చేసుకున్న భక్తులకు ఈనెల 28 తర్వాత వారు ఇచ్చిన చిరునామాకు తలంబ్రాల ప్యాకెట్లను ఏజెంట్ల ద్వారా పంపించనున్నట్లు తెలిపారు. కాగా, కరీంనగర్ రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు రెండు వేల మంది తలంబ్రాలను బుకింగ్ చేసుకున్నట్లు వెల్లడించారు.

'ముదిరాజ్ కులస్తులను బీసీ ఏలో చేర్చవద్దు'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: ముదిరాజ్ కులస్తులను బీసీ ఏ చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అత్యంత వెనుబడిన కులాలను మాత్రమే బీసీ ఏలో చేర్చారని, ఇతర కులాలను సైతం ఇందులో చేరిస్తే ఈ కేటగిరీలోని కులాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీసీ ఏలో ముదిరాజ్‌లను చేర్చాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే కోర్టులను ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు శంకర్, రాజు పాల్గొన్నారు.

దూర విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: దూర విద్యా కేంద్రాల ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను పేద, మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యనభ్యసించాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు. ఆదివారం ఎస్సారార్ కళాశాలలోని దూర విద్యా కేంద్రం ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ, పీజీ విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాంతీయసమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ కౌన్సిలర్స్ పరశురాము, రమేశ్, వసంత, రాము, సంతోష్‌కుమార్ సిబ్బంది వీరస్వామి, మహదేవ్ పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి పర్సు అప్పగింత

తెలంగాణచౌక్, ఏప్రిల్21: నగరానికి చెందిన మధుమతి ఆదివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగే సమయంలో పర్సు పోగొట్టుకున్నది. దానిని గమనించిన సిబ్బంది కంట్రోలర్ అంజయ్యకు అప్పగించారు. పర్సులో ఉన్న ఆధారాలతో ప్రయాణికురాలు మధుమతికి సమాచారం అందించారు. బస్టాండ్ ఏటీఎం రజనీకృష్ణ సమక్షంలో పర్సు మధుమతిగా నిర్ధారించి. కంట్రోలర్ అంజయ్య ఆమెకు అందజేశారు. పర్సులో విలువైన పత్రాలు ఉన్నాయని, దానిని సమాచారం ఇచ్చి అప్పగించిన ఆర్టీసీ సిబ్బందికి మధుమతి ధన్యవాదాలు తెలిపారు.

సహస్ర చంద్ర దర్శకులకు ఘన సన్మానం

వయోవృద్ధులను సన్మానిస్తున్న విశ్రాంత హైకోర్టు జడ్జి చంద్రకుమార్

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఏప్రిల్ 21: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ విశ్రాంత ఉద్యోగుల- సహస్ర చంద్ర దర్శకులకు (80 సంవత్సరాలు దాటిన వారికి) సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా విశ్రాంత హైకోర్టు జడ్జి చంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ, వయస్సు శారీరానికే కానీ, మనసుకు కాదన్నారు. శరీరం అశాశ్వతమని, మనం చేసిన మంచి ఒక్కటే సమాజంలో శాశ్వతంగా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ, మనిషి జీవితం అర్థాంతరంగా, అర్థరహితంగా ముగిసిపోకూడదని, ఇతరులను చీకటి నుంచి వెలుగువైపు మళ్లించేందుకు మార్గదర్శకం కావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహస్ర చంద్ర దర్శకులు తిప్పర్తి ఆనందం-నాగలక్ష్మి, సంగోజు రామకిష్టయ్య-వజ్రమ్మ, శ్రీరామోజు చిరంజీవాచారి - లలితాదేవి, కొత్తూరి శంకరయ్య-సరోజ, గౌరీ శంకర్-యశోద, వెంకటేశ్వర్లు-రాజ్యలక్ష్మి, వడ్లూరి వెంకటేశ్వర్లు-చంద్రకళ దంపతులను ఘనంగా సన్మానించారు. వోపా జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహన్ ఆచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, మొగ్దుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలనీ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, యాస్వాడ అంజయ్య, బండ్ల శివప్రసాద్, వంగల అనోధరాచారి, ఎర్రోజు భీష్మాచారి, తిప్పర్తి అంజయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్

కార్పొరేషన్, ఏప్రిల్ 21: కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. మున్సిపల్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు కొమురయ్య ఇంటి సమీపంలో అగ్ని ప్రమాదం జరుగగా.. డ్రమ్ములు, బకెట్లతో పాటు కరెంటు సర్వీస్ వైరు, పరికరాలు కాలిపోయాయని కార్పొరేటర్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

బావిలో పడి వృద్ధుడు మృతి

వీణవంక, ఏప్రిల్ 21: కిష్టంపేట గ్రామానికి చెందిన బొంగోని పోశయ్య (73) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పోశయ్య శనివారం రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి చాలా సేపటి వరకు కూడా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అనుమానంతో వెతుకగా ఇంటి దగ్గరలోని పొలం గట్టుపై అతడి చెప్పులు, చేతి కర్ర కనబడ్డాయి. పక్కనే గల బావిలో పోశయ్య మృతదేహం కనిపించింది. అతడి మనుమడు బొంగోని శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కరీంనగర్‌కు ఫోన్‌ట్యాపింగ్ నిందితుడు

- కోర్టు ఆదేశాలతో రాధా కిషన్‌రావును తీసుకువచ్చిన పోలీసులు
- తల్లి అనారోగ్యమే కారణం

కరీంనగర్ రాంనగర్, ఏప్రిల్ 21 : ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్‌రావును పోలీసులు కరీంనగర్‌కు తీసుకువచ్చారు. తన తల్లి సరోజినీదేవి(98) అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెను స్థానిక ప్రైవేటు దవాఖానలో గత నెల 12న చేర్చారు. ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతున్న ఆమెను ప్రస్తుతం ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కాగా, తన తల్లిని చూసేందుకు అనుమతి ఇవ్వాలని రాధాకిషన్‌రావు కోర్టు అనుమతి కోరారు. దీంతో ఆదివారం 11 నుంచి 3 గంటల వరకు కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానకు వెళ్లి ఆయన తల్లిని చూసేందుకు కోర్టు అనుమతించింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఖైదీ కావడంతో రాధా కిషన్‌రావుకు ఎస్కార్ట్ వాహనాలను ఏర్పాటు చేసి మరీ కరీంనగర్‌కు తరలించారు. తల్లితో దాదాపు నాలుగు గంటల పాటు దవాఖానలో గడిపిన రాధాకిషన్‌రావును కోర్టు ఇచ్చిన సమయం ముగియడంతో తిరిగి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు తరలించారు.

వైవిధ్యమైన కవిత్వంతో 'కవనభేరి'

పుస్తకాన్ని ఆవిష్